# బామ్మ ప్రయాణం

మినీకథ

- కణితి వెంకట దుర్గారావు



మా అక్కయ్య కూతుర్ని —అంటే మా బామ్మకి ముది మునుమరాల్ని చూడాలని, దానికోసం హైదరాబాదు పంపించమని వారం రోజుల్నించి మా బామ్మ ఒకటే పోరు. నాకు శలవు లేదంటే రైలెక్కించేస్తే వెళ్లిపోతానంది.

ఉదయం మీనార్ ఎక్కించి, రైలు బయల్దేరేదాకా వుండి, టి.సి.కి ప్లాట్‌ఫాం టిక్కెట్టిచ్చాను. నా మొహాన్ని ఎగాదిగా చూశాడు, అది 'విజయవాడ నుంచి హైదరాబాదు టిక్కెట్ కావడం' వల్ల. ఏడుపులాంటి నవ్వు నవ్వి బయటకొచ్చాక నిజంగానే ఏడుపొచ్చింది.

ప్లాట్‌ఫాం టిక్కెట్టావిడకిచ్చినందుకు బాధపళ్లేదు కాని ఈ విషయం మా వాళ్ళకు తెలిస్తే ఒక్కొక్కళ్లు విడివిడిగా నా మీద తిట్ల ప్రయోగం చేస్తారని. ఆవిడ్ని పట్టుకొని ఏ జైల్లో వేస్తారో, ఏం చేస్తారోనని పరిపరి విధాల ఆలోచనలతో నాల్రోజులు నిద్రలేదు.

ఆఫీసులో పన్జేస్తున్నానే కాని మనసంతా బామ్మ కోసమే, ఆవిడ పడే కష్టాల్ని తలంచుకుంటూ కూర్చున్నాను. ప్యూన్ ఉత్తరం తెచ్చిచ్చాడు.

చిరంజీవి సుబ్బూ! (సుబ్బరాయ శర్మ)

నువ్వు చేసిన పొరపాటుకు బాధపడకు, నేను క్షేమంగా హైదరాబాదు చేరాను. ఖమ్మం దాటిన తరువాత రైల్లో టి.సి. వచ్చాడు. "నా మనవడు పళ్లు కొంటానికి దిగాడు నాయనా, ఏ పెట్లో ఎక్కాడో ఏమో, టిక్కెట్లు వాడి దగ్గరే వున్నాయి, వాడు నీక్కనిపిస్తే తొందరగా రమ్మని చెప్పు నాయనా" అన్నాను. నా ప్రక్కన కూర్చున్న ఓ కుర్రాడు ఖమ్మంలో దిగాడు. నా ఎదురుగుండా కూర్చున్న వాళ్లు నా. మనవడు నిజంగానే పళ్లు కొంటానికి దిగాడని టి.సి.కి చెప్పారు.

హైదరాబాదు స్టేషన్‌లో దిగి గేటు దగ్గరకు చెంగుతో కళ్లు తుడుచుకుంటూ, ఇంచుమించు ఏడుస్తూనే వెళ్ళి "మీనార్ ఎక్స్‌ప్రెస్ దార్లో పట్టాతప్పి పడిపోయిందా బాబూ" అని అడిగాను. ఏం, అన్నట్లు ఆశ్చర్యంగా చూశాడు. "జనమంతా అనుకుంటున్నారు నాయనా, బెజవాడ్నుంచి నా మనవడు వస్తున్నానని ఉత్తరం వ్రాశాడు, నాల్రోజుల్నుంచి రోజూ స్టేషనుకు ప్రతీ రోజు వస్తూనే వున్నాను, మతి మరుపుతో ఇవ్వాళ ప్లాట్‌ఫాం టిక్కెట్టు కూడా కొన్లేదు, నాకు ఒక్కడే మనవడు,వాడు పోతే నేనుండ లేను" అని గట్టిగా ఏడ్చాను. "అవును రైలు పట్టాలు తప్పి ఆరువందల జన నష్టం" అన్నాడు. నేను అక్కడే చతికిల పడి ఏడ్వడం మొదలు పెట్టాను. టి.సి. హేళనగా నవ్వాడు. నేనక్కడ్నించి లేచి ఏడుస్తూనే గండం తప్పిందని బయటకు నడిచాను. టి.సి. హేళనగా నవ్వి నేను పిచ్చిదాన్ననుకుంటాడు. దానికినే బాధపడ్డం లేదుకాని, నిన్ను మన వాళ్ళ నరకయాతన నుంచి తప్పించినందుకు నాకు సంతోషంగావుందిరా సుబ్బూ, అందుకే ఈ విషయం ఎవరకి తెలియకూడదని ఆఫీసుకు వ్రాశాను.

ఇట్లు

మీ బామ్మ.

రేపో మాపో చావబోయే బామ్మ ఇంత తెలివిగా తప్పించుకుని, నన్ను తిట్లపోరు నుంచి విముక్తి చేసినందుకు, చాలా సంతోషంగానూ, మా బామ్మంటే గర్వంగానూ వుంది. ఉత్తరం అక్కడే చింపిపారేశాను!